

ఎంఐఎస్ కో ఆర్డినేటర్ తొలగింపు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 11: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఐఎస్ సమన్వయకర్తగా తాత్కాలికంగా పనిచేస్తున్న గొటారి మనోజ్‌ను తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీకి అనుకూలంగా మనోజ్ తన వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేశాడు. దీనిపై ఈ నెల 8న ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టారు. మనోజ్ వాట్సాప్‌లో మెసేజ్ చేసినట్లు తేలడంతో కలెక్టర్‌కు నివేదిక అందించారు. దీంతో ఆయన్ను తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మనోజ్.. జగన్ మీడియాలో పనిచేస్తున్నాడు.

కొఠియా ఓటర్లు ఎటువైపు?

- ఈ గ్రామాలపై పట్టుబిగిస్తున్న ఒడిశా
- గత ఐదేళ్లలో రూ.కోట్లాది అభివృద్ధి పనులు
- ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకే వచ్చేలా ఏర్పాట్లు..
- పట్టించుకోని ఏపీ సర్కారు





కొఠియా గ్రూప్ గ్రామాలు రెండు (ఏపీ, ఒడిశా) రాష్ట్రాల పరిధిలోకి వస్తాయి. ఇక్కడి ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఒడిశా ప్రభుత్వం ప్రతీ అవకాశాన్ని వినియోగించు కుంటోంది. ఈ ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. కానీ ఏపీ ప్రభుత్వం చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించలేక పోతోంది. కొఠియా ప్రజలు ఓటు వేసేందుకు వారికి సమీపంలోనే పోలింగ్ కేంద్రాలను ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 22 కిలోమీటర్ల పరిధిలో నెలకొల్పింది.

\- సాలూరు రూరల్

ఏవోబీలో ఉన్న కొఠియా గ్రూప్ గ్రామాలపై ఒడిశా పట్టుబిగిస్తోంది. మొత్తం 21 కొఠియా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి వాటిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ఇప్పటికే అక్కడి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొఠియా గ్రూప్ గ్రామాల్లోని ఓటర్లలో అత్యధికమంది తమ రాష్ట్ర పోలింగ్ బూత్‌లకే వచ్చి ఓటు వేసేలా ఒడిశా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుంది. కొఠియాలో ఏక కాలంలో ఏపీ, ఒడిశాలకు చెందిన అరకు, కోరాపుట్ (లోక్‌సభ స్థానాలు), సాలూరు, పొట్టంగి అసెంబ్లీ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనున్నాయి. దీనికోసం ఇరు రాష్ట్రాల అధికారులు ఈ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తారు. ఓటర్లు తమకు నచ్చిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయవచ్చు. ఈ విధానం ఎన్నోఏళ్ల నుంచి ఉంది. అయితే, ఈసారి ఎన్నికల్లో మాత్రం ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఒడిశా ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ విద్యుత్ సిబ్బంది గత నెల 28న దిగువ గంజాయిభద్రలో ఉచిత విద్యుత్ మీటర్లు బిగించేందుకు వెళ్లితే వారిని ఒడిశా అధికారులు ఎన్నికల కోడ్ పేరిట అడ్డుకున్నారు. ఆటోతో సహా సామగ్రి, సిబ్బందిని కొఠియా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి తదుపరి విడిచిపెట్టారు.

ఒడిశా అధికారుల ముమ్మర పర్యటనలు..

ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా, వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్ పాఢి, కోరాపుట్ ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) కీర్తివాసన్, దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ చరణ్‌సింగ్ మిశ్రా, కోరాపుట్ ఎస్పీ అభినవ్ సోంకర్ తదితరులు కొఠియాలో ఈ నెల 5న పర్యటించారు. గంజాయిభద్ర ఆదర్శ విద్యాలయం, కొఠియా 5 టీ పాఠశాలలను పరిశీలించారు. స్ట్రాబెర్రి సాగు, కొఠియా పంచాయతీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం పరిశీలించి వెళ్లారు. గత నెల 22న ఒడిశా ఎన్నికల సీఈవో నికుంజ బిహారి ధైల్ కూడా పర్యటించారు. కొఠియా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకే వారు పర్యటించినట్లు పలువురు భావిస్తున్నారు. గత ఐదేళ్లలో కొఠియాలో రెండు సార్లు ఒడిశా సీఎస్, వ్యవసాయ రాష్ట్ర కమిషనర్, ఆర్డీసీ (రీజియన్ డెవలప్‌మెంట్ కమిషనర్) పర్యటించగా, కోరాపుట్ జిల్లా కలెక్టర్ అయితే తరచూ పర్యటిస్తున్నారు.



కొఠియాలో పర్యటిస్తున్న ఒడిశా సీఎస్ ప్రదీప్ జెనా (ఫైల్)

దృష్టి సారించని ఏపీ అధికారులు..

వివాదస్పద కొఠియా గ్రామాల్లో పర్యటనలపై ఏపీ ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదు. సామరస్య పూర్వక ఎన్నికల నిర్వహణకు ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఇటీవల విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఇదే విషయమై ఒడిశాకు చెందిన కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, ఎస్పీ అభినవ్ సోంకర్‌తో చర్చించారు.

ఆరుచోట్ల ఒడిశా.. నాలుగు చోట్ల ఏపీ పోలింగ్ కేంద్రాలు..

కొఠియా గ్రామాల గిరిజనులు ఓటు వేసేందుకు అనువుగా పగులుచెన్నారు, కొఠియా, ఎగువ గంజాయిభద్ర, రణసింగి, గాలిగాబడరుల్లో పోలింగ్ కేంద్రాలను ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొఠియాలో 510 మంది ఓటర్లు, పగులుచెన్నారులో 598 మంది, మూడకారులో 338, గంజాయిభద్రలో 769, రణసింగిలో 584, గాలిగబాడరులో 535 మంది ఓటర్లు ఉన్నారు. కనీసం 2 నుంచి 6 ఆరు కిలోమీటర్ల దూరం లోపు పోలింగ్ బూత్‌లను ఒడిశా ఏర్పాటు చేసింది. ఏపీ మాత్రం కొఠియా గ్రూప్ గ్రామాల నుంచి నమోదైన 2,554 మంది ఓటర్ల కోసం నేరేళ్లవలసలో రెండు, శిఖరపరువు, కురుకూటిలో ఒక్కొక్క పోలింగ్ బూత్ ఏర్పాటు చేసింది. ఈ పోలింగ్ బూత్‌లకు రావాలంటే కనీసం 4 నుంచి అత్యధికంగా 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది.

బిల్లులు చెల్లించని ఏపీ సర్కారు..

గత ఐదేళ్లలో దాదాపు రూ.210 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు ఒడిశా రాష్ట్ర రాజకీయ నేతలు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో బీటీ రోడ్లు, వంతెనలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసింది. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అయితే, ఏపీ ప్రభుత్వం మాత్రం కొఠియా గ్రూప్ గ్రామాలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. చేసిన పనులకు బిల్లులు కూడా సక్రమంగా చెల్లించలేకపోతుంది. ఫలితంగా నేరేళ్లవలసలో సంత షెడ్డు, తదితర పనులు నిలిచిపోయాయి. అదే విధంగా పగులుచెన్నారు, పట్టుచెన్నారు తదితర గ్రామాల్లో ఏపీ పక్షాన చేసిన వీధిరోడ్లు, కాలువలు, ఫ్లడ్‌వాల్ తదితర పనులకు బిల్లులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు





సాలూరులో చిన్నారుల ఆలింగనం



సాలూరు ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పార్వతీపురం టౌన్/సాలూరురూరల్, ఏప్రిల్ 11: జిల్లాలోని ముస్లింలు గురువారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కేంద్రం పార్వతీపురం లోని జామీయా మసీదులో ముతావళీ, జిల్లా ముస్లిం సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో, సాలూరు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఈద్గా స్థలంలో, సాలూరు మదరసాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హనీఫ్, మౌలానా నూరుద్దీన్, హైదర్, షరూక్‌ఖాన్, తదితరులు మాట్లాడుతూ.. దాతృత్వానికి, సామరస్యానికి, క్రమశిక్షణకు ప్రతీక రంజాన్ అని అన్నారు. పేదలకు ఆదుకోవడానికి రంజాన్ మరింత దోహదపడుతుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ముస్లిం తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రార్థనలు అనంతరం పేదలకు ఫితర్ దానాలు చేశారు. బంధుమిత్రులకు విందు ఇచ్చారు.



పార్వతీపురం టౌన్: ముస్లింల సందడి



రామినాయుడువలసలో వరి చేలు తింటున్న ఏనుగులు

వదలని ఏనుగులు

- వరి, మొక్కజొన్న పంటలు నాశనం



మొక్కజొన్న పంటను నాశనం చేసిన దృశ్యం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 11: జియ్యమ్మవలస మండలాన్ని ఏనుగులు వదలడం లేదు. గతకొన్ని రోజులుగా ఇక్కడే తిష్ఠ వేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని పెదమేరంగి పంచాయతీ రామినాయుడువలస గ్రామంలో బుధవారం రాత్రి నుంచి ఏనుగుల గుంపు తిష్ఠ వేసింది. సమీప పంట పొలాల్లో గురువారం మధ్యాహ్నం సేదతీరాయి. అరటి, మొక్కజొన్న, వరి పంటలను నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గురువారం సాయంత్రం కన్నపుదొరవలస గ్రామ పొలిమేరకు చేరుకొని అక్కడ పంటలను కొంతమేర నష్టపరిచినట్లు రైతులు చెబుతున్నారు. వాటి దగ్గరకు ఎవరినీ వెళ్లనీయకుండా ట్రాకర్లు చర్యలు తీసుకుంటున్నారు. ఏనుగుల వల్ల పొలాలకు వెళ్లలేకపోతున్నామని, పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి వాటిని పూర్తిస్థాయిలో తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ, తదితరులు

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

పార్వతీపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జాయింట్ కలెక్టర్ శోభిక నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సమ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన జీవితం ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, ఎస్‌డీసీ ఆర్.వి.సూర్యనారాయణ, జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేజీ బంగారం పట్టివేత

పాలకొండ, ఏప్రిల్ 11: ఓ కారులో తరలిస్తున్న కేజీ బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల దృష్ట్యా పట్టణంలోని గాయత్రీ దేవి ఆలయ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు, ప్రత్యేక బలగాలు గురువారం వాహన తనిఖీలు చేపట్టాయి. ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి శ్రీకాకుళం వెళుతున్న కారుని ఆపి తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న సుమారు కేజీ బంగారం పట్టుబడింది. ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకుని తొలుత పాలకొండ ట్రెజరీకి, అనంతరం పార్వతీపురం ట్రెజరీకి తరలించారు.



కారును తనిఖీ చేస్తున్న దృశ్యం

ఐదేళ్లు సరిపోలేదా?

- పూర్ణపాడు - లాబేసు వంతెనపై వైసీపీ నిర్లక్ష్యం
- 20 శాతం పనులు పూర్తి చేసుకోలేకపోయిన వైనం
- ప్రజలకు తప్పని పడవ ప్రయాణం

2018లో చేపట్టిన పాదయాత్ర సమయంలో కురుపాం బహిరంగ సభలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలుగుదేశం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేయడం కూడా చేతకాలేదని అప్పటి ప్రభుత్వంపై మండిపడ్డారు. తీరా అధికారం చేపట్టిన తరువాత వంతెనను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఈ ఐదేళ్లలో మిగిలి ఉన్న 20 శాతం పనులను పూర్తి చేసుకోలేక పోయారు. విపక్షంలో ఉన్నప్పుడు విమర్శలు చేసిన నాయకులు అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న దాఖలాలు లేవని గిరిజనులు మండిపడుతున్నారు.

(కొమరాడ)



అసంపూర్తిగా పూర్ణపాడు - లాబేసు వంతెన

కొమరాడ మండల వాసులు చిరకాల స్వప్నం నాగావళి నదిపై పూర్ణపాడు - లాబేసు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం. ఈ వారధి పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తొలగిపోవడమే కాదు, చుట్టు పక్కల ఉన్న మండలాలకు సైతం రాకపోకలకు అనువుగా ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వంతెన పనులు ప్రారంభమయ్యాయి. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈలోగా ఎన్నికలు రావడంతో మిగిలిన పనులు చేసే అవకాశం లేకుండా పోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ వంతెనను పూర్తిగా విస్మరించింది. మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయలేకపోయింది. ఈ ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం చాలలేదా? అని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కురుపాం శాసనసభ్యురాలు పాముల పుష్పశ్రీవాణికి మంత్రి పదవి దక్కడంతో ఈ ప్రాంతవాసులంతా వంతెన నిర్మాణం జరుగుతుందని సంబరపడ్డారు. తీరా ఆమె వంతెన పూర్తి కోసం అదనపు నిధులు జీవోలు తెచ్చారు తప్ప నిర్మాణం మాత్రం పూర్తి చేయలేకపోయారు. దీంతో నదిపై పడవ ప్రయాణమే ఈ ప్రాంతవాసులకు శరణ్యంగా మారింది. కొమరాడ మండలానికి చెందిన 30 గ్రామాలు, 8 గ్రామ పంచాయతీలలో నాగావళి నదికి తూర్పున ఉన్నాయి. వర్షా కాలంలో వీరంతా కొమరాడ మండల కేంద్రానికి చేరుకోవాలంటే పడవ ప్రయాణం తప్పడం లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని గొప్పలు చెబుతున్న వైసీపీ ప్రభుత్వం సుమారు రూ. 8 కోట్లు నిధులు కేటాయించి పనులు చేయిస్తే వేలాది మందికి రాకపోకలకు సౌకర్యం కలిగేది. కానీ, పట్టించుకోవడం లేదు.



ఎల్ఎన్‌పురంలో పూర్తిగా ఎండిపోయిన చెరువు

ఎండిపోతున్న చెరువులు

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 11: ఎండలకు మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్నాయి. గత ఖరీఫ్ సీజన్ చివరిలో వర్షాలు పడకపోవడంతో చెరువులకు రైతులు ఇంజన్లు పెట్టి పొలాలకు నీటిని తరలించారు. దీనివల్ల ప్రస్తుతం ఎల్ఎన్‌పురం, చిన్నబండపల్లి, తదితర గ్రామాల పరిధిలో ఉన్న చెరువుల్లో చుక్కనీరు లేని పరిస్థితి నెలకొంది. కనీసం మూగజీవాలు కూడా తాగడానికి చెరువుల్లో నీరు లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అడుగడుగూ గోతులమయం

● అధ్వానంగా గజపతినగరం రోడ్లు ● ప్రమాదకరంగా ఆండ్ర రహదారి ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అధిక బరువుతో వెళ్తూ గుంతలో కూరుకుపోయిన లారీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. గజపతినగరం నుంచి ఆండ్ర వెళ్లే మార్గమంతా గోతులమయంగా మారి సంవత్సరాలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గజతినగరం నుంచి లోగిశ, కెంగువ, పాత బగ్గాం, ముచ్చెర్ల, వెంకటాపురం తదితర గ్రామాల మార్గలు గోతులమయంగా మారినా ఎటువంటి చర్యలు లేవు. మంత్రి బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న చోటే పరిస్థితి ఇలా ఉందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆండ్ర వెళ్లే మార్గంలో మెంటాడ వద్ద చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు సంబంధించి, రా మెటీరియల్ ఇదే రోడ్డు ద్వారా నిత్యం తరలిస్తుంటారు. ఒక్కోలారీలో పరిమితికి మించి, అక్రమంగా 40-50 టన్నుల లోడ్‌తో మెటీరియల్‌ను లారీలో తరలిస్తున్నారు. రోజూ సుమారు 50 నుంచి 70 లారీలు ఈ చిన్నపాటి రోడ్డు మార్గం గుండా ప్రయాణి స్తాయి. ఈ రోడ్డు సామర్థ్యానికి మించి రా మెటీరియల్ రవాణా చెయ్యటం వల్ల రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో లారీలు గుంతల్లో ఇరుక్కుపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. రాత్రిళ్లు ఈ మార్గం గుండా ప్రయాణించే వారు. ప్రమాదాలకు గురై, గాయాలపాలవుతున్నారు. సామర్థ్యానికి మించి లారీల్లో కంకర, గ్రావెల్, ఇసుక, తదితర మెటీరియల్ తరలిస్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే అప్పలనర్సయ్య కానీ, ఆర్టీఏ, రెవెన్యూ అధికారులు కానీ కనీసం పట్టించుకోకపోవటంతో ఆందోళన వ్యక్తమవుతుంది. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీళ్లంతా కమిషన్ల కోసం కోసం కళ్లుమూసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



గుంతలమయంగా గజపతినగరం-ఆండ్ర రోడ్డు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శంకరరావు (ఫైల్)

పాచిపెంట, ఏప్రిల్ 11: అనుమానాస్పద స్థితిలో పాచిపెంట గ్రామానికి చెందిన డోల శంకరరావు(36) గురువారం ఉదయం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నారాయణరావు వివరాల ప్రకారం శంకరరావు మృతదేహం మండలంలోని పి.కోనవలస సమీపంలో గల పెద్దగెడ్డకు ఆనుకుని ఉన్న కర్రివలస, వేగావతి ఆన కట్ట ఎడమ కాలువ పక్కన కనిపించింది. ఆ సమీపంలో గల చీపు రువలస గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందించా రు. వెంటనే ఎస్ఐ నారాయణరావు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహానికి శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమి త్తం సాలూరు ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నారాయణరావు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

రేగిడి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం అక్కున్నఅగ్రహారం గ్రామానికి చెందిన కామోజీ గురుమూర్తి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మోటార్‌బైక్‌పై ఉంగరాడమెట్ట జంక్షన్‌కు వస్తుండగా ఎదురుగా మరో బైక్‌పై వస్తు న్న గరివిడి మండలం గెడ్డాపువలసకు చెందిన తాడ్డి జగదీష్ బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సిబ్బంది ఈశ్వరరావు, పవన్‌కుమార్ ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం రాజాం తర లించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం, ఏప్రిల్ 11: సీతానగరం మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన ముచ్చి మంగమ్మ (గంగ 23) పార్వతీపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల ప్రకా రం గత నెల 20న కొత్తవలసలోని తన కన్న వారింట్లో స్నానం నిమిత్తం కట్టెలతో వేడినీరు మరగబెడుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పు అంటుకోగా శరీరం కాలిపోయింది. ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో ఈ నెల 1న చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందా రు. మృతురాలు మంగమ్మకు గత ఏడాది మండలంలోని సూరమ్మపేట గ్రామానికి చెందిన బొబ్బిలి గౌరిశంకర్‌తో వివాహమైంది. గౌరి శంకరరావు సూరమ్మపేట వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక బాబు ఉన్నాడు. గత నెలలోని ఆసు పత్రిలో జన్మించగా ఆమె బాబుతో కలిసి కన్నవారింటికి వెళ్ళింది. శవ పంచనామా అనంతరం పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి

సీతానగరం: గుర్తు తెలియని రైలు ఢీ కొని కొంచాడ ఈశ్వరమ్మ(60) మృతి చెందిన ఘటన మండలంలో మర్రిపివలస గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన కొంచాడ ఈశ్వరమ్మ గత కొన్ని రోజులుగా మతి స్థిమితం లేకుండా ఉంది. ఆమె బుధవారం ఊరి నుంచి వెళ్లిపోయింది. గురువారం మర్రిపివలస సమీపంలో ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగి అక్కడిక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ తెలిపారు.

లెక్కలు చూపని రూ.1.52 లక్షలు సీజ్

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి జంక్షన్‌లోని చెక్‌పోస్టు దగ్గర లెక్కలు చూపని 1.52 లక్షల రూపాయల నగదును ఇద్దరి దగ్గర నుంచి స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ లోవరాజు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 50 వేల రూపాయలకు మించి నగదుతో ప్రయాణించరాదన్నారు. సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా గురువారం ఇద్దరు వ్యాపారుల నుంచి ఈ మొత్తాన్ని గుర్తించామన్నారు. మధ్యవర్తుల సమక్షంలో నగదును సీజ్ చేసి తదుపరి చర్యల కోసం జెడ్పీ సీఈవోకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

పార్వతీపురం టౌన్/ పార్వతీపురం రూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. గురువారం సాయంత్రం పార్వతీపురం మండలంలోని హెచ్.కా రాడవలస గ్రామ సమీపంలో తాళ్లబురిడి గ్రామం నుంచి నిడగల్లు గ్రామానికి వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పైలా సింహాచలం(68), సుబ్బలక్ష్మి, అనూషాలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకువస్తున్న సమయంలో పైలా సింహచలం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు, బంధువులు తెలిపారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి

కొమరాడ: సరిహద్దు ప్రాంతంలో ఆంధ్ర, ఒడిశా పోలీసులు చేపట్టిన దాడుల్లో భారీస్థాయిలో పులిసిన ఊట బెల్లం, సారా డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పెళ్లిగుడ్డి, బొత్తడపల్లి సమీపంలో చేసిన దాడుల్లో 70 డ్రమ్ములు, 300 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. 9 వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకర్, ఎక్సైజ్ అధికారులు, ఒడిశా పోలీసులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజిరోడ్డు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం సీసాలను ఒక మహిళ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఖైనీ, గుట్కా స్వాధీనం



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్లు

గరివిడి: గరివిడి రైల్వే బ్రిడ్జి కింద ఖైనీ గుట్కాలను విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారస్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్లను గరివిడి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఖైనీ, గుట్కా ప్యాకెట్ల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని గరివిడి పోలీసులు అంచనా వేస్తున్నారు. ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామని గరివిడి ఎస్ఐ దామోదరరావు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

విజయనగరం రింగురోడ్డు: ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులు తమకు ఎటువంటి సమస్యలు ఉన్నా.. ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. 99592 25620 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

రేరా చట్టంపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: రేరా చట్టం-2016పై అవగాహన సమావేశాన్ని ఈ నెల 13న ఉదయం 10 గంటలకు విజయనగరం తహశీల్దారు కార్యాలయ ఆవరణలో గల జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఐసీ ఇన్‌ఛార్జి చదలవాడ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థిరాస్తి నియంత్రణ ప్రాధికారిక సంస్థ నిబంధనలు, కొనుగోలుదారులకు సూచనలు, ప్రమోటర్స్ సొసైటీ రిజిస్టర్ పురోగతి తదితర విషయాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

విజయనగరం రింగురోడ్డు: ఆల్ఫా కంప్యూటర్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా పేద, మధ్య తరగతి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు తరుణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీడీడీసీఏ, డీటీపీ, టాలీ, సీ, సీ ప్లస్, ప్లస్, జావా, ఎంఎస్ ఆఫీస్ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఆల్ఫా సెంటర్‌లో ఈ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 93464 36642, 89198 46665 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

సీతానగరం: ఆరోగ్య కార్యక్రమాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీఎంవో టిజగన్మోహన రావు ఆదేశించారు. ఎఫ్‌డీపీ నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్‌తో కలిసి బలిజిపేట మండలంలోని బర్లి, మిర్తివలస గ్రామాల్లోని హెల్త్ వెల్నెస్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రగతి నివేదికలు, రికార్డులను పరిశీలించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ మొదటి త్రైమాసికంలోనే త్వరగా జరగాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో ప్రిజం10 (పీఆర్ఐఎస్ఎం 10) పక్కాగా అమలు చేస్తూ శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ శ్రీధర్, వైద్యాధికారి శివగాయిత్రి, సూపర్‌వైజర్లు నారాయణరావు, సత్యవతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉర్లాపు

రాజాం: రాజాం నియోజకవర్గానికి చెందిన ఉర్లాపు రాజు జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ నియామకపత్రం అందించింది. రాజకీయ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు శుభాకాంక్షలు తెలి పారు. ● **పాలకొండ:** జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడిగా గర్భాన సత్తిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సత్తిబాబును జనసేన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వివాదాలు సృష్టిస్తే కఠినచర్యలు : డీఎస్పీ

రాజాం రూరల్, ఏప్రిల్ 11: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలు సృష్టించిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని చీపురుపల్లి డి.ఎస్పీ శ్రీనివాస చక్రవర్తి స్పష్టం చేశారు. మండల పరిధిలోని గురవాం, గడ్డిముడిదాం గ్రామాల్లో గురువారం రాత్రి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల పెద్దలతో చర్చించారు. క్షణకావేశంలో వివాదాలు సృష్టించినా, అల్లర్లను ప్రోత్సహించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని డిఎస్పీ హెచ్చరించారు. రాజాం టౌన్ సి.ఐ. దాడి మోహనరావు పాల్గొన్నారు.

స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు



ప్రాజెక్టు పరిధిలోని స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరి ధిలోని స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు చేస్తు న్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి పైనుంచి నీటి సామర్థ్యం తక్కువగా రావడంతో అధికారులు గేట్లకు గ్రీస్, చైన్ల శుభ్రతతో పాటు వివిధ పనులు చేపడుతు న్నట్టు డీఈ టి.రఘు నాథనాయుడు, జేఈ కిషోర్‌కుమార్ తెలిపారు.

బోధి చెట్టు పునరుద్ధరణ



బోధి చెట్టు నమునా పునరుద్ధరణ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం పెద్ద చెరువు రోడ్డులో ఉన్న బుద్ధ విగ్రహాన్ని ఆనుకుని బోధి చెట్టు నమునా చెట్టు ఉండేది. అది ఇటీవల కూలిపోయింది. ఈ విషయమై ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో 'నిర్లక్ష్యంతోనే శిథి లం' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి నగర పాలక సంస్థ అధికారు లు స్పందించారు. ఆగమేఘాల మీద బోధి చెట్టు నమునాను పునరుద్ధరించారు.

గిరిశిఖర అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నిమెంట్ విజేత ఒడిశా



విజేత జట్టుకు కప్ ప్రదానం చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: గిరిశిఖర అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ఒడిశాకు చెందిన బారి జట్టు విజేతగా నిలిచింది. సాలూరు మండలం గిరిశిఖర గ్రామం చోరలో అంతర్రాష్ట్ర గిరిశిఖర గ్రామాల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఏపీకి, ఒడిశా గిరిశిఖరాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్‌లో చోర జట్టుపై ఒడిశాకు చెందిన బారి జట్టు విజయం సాధించింది. విజేత జట్లుకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి దండి శ్రీనివాసరావు, తోణాం సర్పంచ్ మువ్వల ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల వెండి ఆభరణాలు పట్టివేత



పట్టుబడ్డ వెండి ఆభరణాలు

రాజాం రూరల్, ఏప్రిల్ 11: మండల పరిధిలోని గార్రాజు చీపురుపల్లి జంక్షన్ వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ నిర్వహిస్తున్న తనిఖీల్లో సుమారు ఐదు లక్షలు విలువచేసే ఎనిమిది కిలోల వెండి ఆభరణాలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకు న్నారు. విజయనగరం నుంచి రాజాంలోని పలు బంగారు, వెండి షాపులకు వెండి ఆభరణాలు అమ్మకానికి తెస్తున్నట్లు ఆభరణాలతో పట్టుబడ్డ వ్యక్తి పోలీసులకు స్పష్టం చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి బాలరాజు, ఏఎస్ఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో వీటిని పట్టుకున్నారు. కాగా మండల పరిధిలోని పొగిరి గ్రామ సమీపంలో శ్రీకాకుళం నుంచి రాజాం వస్తున్న ఓ వ్యక్తి నుంచి బుధవారం రాత్రి రూ.1.31,000 మొత్తాన్ని పోలీసులు పట్టుకున్నారు. నగదును రాజాం తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. నగదుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు చూపించడంతో నగదును అందజేశారు.

చంద్రబాబు రోడ్‌షోకు తరలిరావాలి

● మాజీ మంత్రి, రాజాం కూటమి అభ్యర్థి కోండ్రు



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రేగిడి: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15న రాజాం పట్టణంలో రోడ్‌షో నిర్వహించనున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలి వచ్చేలా చూడాలని కోరారు. ఉంగరాడమెట్ట టీడీపీ కార్యాలయంలో గురువారం మూడు పార్టీల నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావే శంలో రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీష్, మండల టీడీపీ నేతలు దూబ ధర్మా రావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గేదల బాలమురళీధర్, చల్ల భుజంగరావు, పాలవలస రామచంద్రినాయుడు, గురువాన రమేష్, కె.మహేష్, గురవాన ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు. **రాజాం:** నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను గెలిపించాలని కోరుతూ మత్స్యకా రులు తమ సంఘ అధ్యక్షుడు బెహరా తవుడు ఆధ్వర్యంలో గురువారం పరశు రాంపేట, దోసరిరామినాయుడువలస, కంచరాం గ్రామాల్లో ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మత్స్యకారుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కోడూరు తవిటన్నదొర, దుచ్చిన శ్రీను, తియ్యాల అప్పలరాము, బొండపల్లి అప్పన్నదొర, తదితరులు పాల్గొన్నారు. ● రాష్ట్ర భవిష్యత్ కోసం దార్శ నికుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన వస్తేనే రాష్ట్ర భవిష్యత్ ఉంటుందని కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బొమ్మినాయుడువలస పంచాయతీ గొల్లపేటకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు, సంతకవిటి మండలం పల్లిటి గ్రామానికి చెందిన 40 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో గురువారం టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు. కార్యకర్తలు, అభిమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అన్ని హామీలు అమలు చేశాం: బొత్స



మాట్లాడుతున్న బొత్స

విజయనగరం దాసన్నపేట: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఒక్క సీపీఎస్ (కాంట్రీబ్యూటరీ పెన్షన్ పథకం) తప్ప, మిగతా అన్నీ ఇచ్చామని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు వైసీపీ ముఖ్య నాయకులతో ఉమ్మడి విజయనగరం జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నెల్లిమర్ల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలో ఉంటూ... కుట్రలు, కుతంత్రాలు చేసే నాయకులను పట్టించుకోకుండా వదిలేయాలన్నారు. సమావేశంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరకు ఎంపీ అభ్యర్థి తనూజ, ఎమ్మెల్యేలు అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, తలే రాజేష్, జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పరీక్షిత్ రాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వైసీపీ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా యథేచ్ఛగా రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సమావేశానికి వెళ్లే రహదారిలో మరింత విస్తృతంగా ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పట్టించుకోకుండా ఫ్లెక్సీలను అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రాక్షస పాలన అంతానికే కూటమి ఏర్పాటు

● విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



ఎస్‌కోట రూరల్: మాట్లాడుతున్న శ్రీభరత్

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో మరోసారి రాక్షసుడు అధికారంలోకి వస్తే ప్రజల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయని... ఈ పాలనకు చరమగీతం పాడేందుకు కూటమి ఏర్పడిందని విశాఖ కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ అన్నారు. గురువారం పోతనాపల్లిలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్ అందించాలని బీజేపీతో చేయి కలిపినట్లు చెప్పారు. బొడ్డవర, తలారీ పంచాయతీల నుంచి పలువురు మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, ఉప సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ● **లక్కవరపుకోట:** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని విశాఖ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఎం. శ్రీభరత్ తెలిపారు. గురువారం సాయంత్రం చందులూరు ఎన్నికల శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. ● **శృంగవరపుకోట**: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపడుతుందని విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారిలు అన్నారు. గురువారం శృంగవరపుకోట శ్రీనివాసకాలనీలో జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● **జామి:** జామిలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● **వేపాడ**: మండలంలోని వీలుపర్తి-వెల్దాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, శ్రీభరత్ పాల్గొన్నారు. సభకు విచ్చేసిన నాయకులకు, అభ్యర్థులకు గ్రామస్థులు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతం పలికారు.

అంధకారంలో చీపురుపల్లి రోడ్

రాజాం రూరల్: రాజాం-చీపురుపల్లి రోడ్‌లో బావిరేతమ్మ మందిరం నుంచి గాయత్రికాలనీ వరకూ సుమారు కిలోమీటర్ మేర అంధకారం రాజ్యమేలుతోంది. రహదారి గోతులమయంగా మారడం, ఆపై అంధకారంతో పరిస్థితి భ యానకంగా మారింది. ఇదిలా ఉంటే చీకటిపడితే చాలు ఇదేరోడ్‌లో మందు బాబులు హల్‌చల్ చేస్తుండడంతో ఆమార్గంలో రాకపోకలు సాగించేవారంతా అవస్థలకు గురవుతున్నారు. రాజాం నుంచి ఈమార్గంలో సైకిళ్లపై గాయత్రికాలనీ, పెనుబాక, కొత్తవలస, మారేడుబాక, బొద్దాం, కొఠారిపురం తదతర గ్రామాలకు వెళ్తున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

బఫర్‌జోన్‌లో నిర్మాణంపై ఫిర్యాదు



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో అనేక చెరువు ప్రాంతాలలో విచ్చలవిడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. తాజాగా స్థానిక భైరిసాగరం చెరువు ప్రాంతంలో వెలసిన లేఅవుట్‌లో బఫర్ జోన్ (లే అవుట్‌కు రక్షణ) గా ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్ స్పందిస్తూ.. బఫర్ జోన్‌లో నిర్మాణ పనులపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై యజమానికి నోటీసులు జారీ చేశా మని చెప్పారు. ఆయన ఇచ్చిన వివరణ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



వీరఘట్టం: దీక్షలు చేస్తున్న ముస్లింలు



భామినిలో..

వీరఘట్టం: పట్టణంలోని జామియా మసీదులో గురువారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు అధ్యక్షుడు షేక్ఇమామ్, మసీదు గురువు ఆధ్వర్యంలో 30 రోజులు ఉపవాస ప్రార్థనలు చేసి గత రాత్రి చంద్రుని నెలవంక చూసి ఉపవాసాలు విరమించారు. తెల్లవారుజామున కొత్త దుస్తులు ధరించి పిండి వంటలు చేసుకొని అందరూ మసీదుకు వచ్చి వారి ఉపవాస విరమించారు. ● **భామిని:** బత్తిలి మసీదులో గురువారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే ముస్లింలంతా మసీదు వద్దకు చేరుకుని నమాజ్ చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ముబారక్ అని చెప్పుకున్నారు.

జ్యోతీరావు పూలేకు నివాళి



పార్వతీపురంలో పూలే చిత్రపటం వద్ద నివాళులు..



పాలకొండ: నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ కార్యాలయంలో గురువారం జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందరంగా జ్యోతీరావు పూలే చిత్రపటానికి జగదీష్తో పాటు మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **పాలకొండ:** సంఘ సంస్కర్త, మానవతావాది జ్యోతీరావు పూలే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. పూలే జయంతిని కళాశాలలో గురువారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



కొత్తూరులో కవాతు చేస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండలంలోని కొత్తూరు, శివ్వాం గ్రామాల్లో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఘర్షణలకు తావులేకుండా ఉండేలా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ముందస్తుగానే గుర్తించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న నారాయణస్వామి

పార్వతీపురం టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమన్న సూక్తితో ప్రతిఒక్కరినీ నడిపించేందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ నారాయణ స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటుచేసిన నడక.. నడత అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో అన్ని వయస్సుల వారు, వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారితో పాటు విద్యార్థులు, విద్యావంతులు మానసికంగా అలసిపోతున్నారన్నారు. అందుకే ఉదయం ఒక గంటపాటు నడవాలని సూచించారు.

వైభవంగా సుదర్శన హవనం



హోమం చేస్తున్న రుత్వికులు

సాలూరు రూరల్: సాలూరు పెదకోమటిపేట రామాలయం వద్ద సీతారామ వసంత నవరాత్ర ప్రయుక్త వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం సుదర్శన హవనం వైభవంగా నిర్వహించారు. సీతారాములకు సుప్రభాత సేవ, తోమాల సేవ, బాలభోగ నివేదన, మంగళాశాసనాలు నిర్వహించారు. హోమ పూజలు చేశారు. అనంతరం సుదర్శన హవనం నిర్వహించారు. సుదర్శన శ్రీచక్రానికి వివిధ అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దళాయివలసలో శ్రీరామ మాలధారణ



రామాలయంలో భజనలు చేస్తున్న రామ భక్తులు

గరుగుబిల్లి: దళాయివలస గ్రామంలో శ్రీరామ భజన మండలి సభ్యులు శ్రీరామ మాలధారణ దీక్షను చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో వారం రోజుల పాటు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు శ్రీరామ భజన మండలి సభ్యుడు గులిపల్లి చినతిరుపతిరావు తెలిపారు. శ్రీరామ నవమి అనంతరం దీక్షను విరమించనున్నామని చెప్పారు. ఈ శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: బూరుగ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా కార్యక్రమం గురవారం రమేష్శర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం పెద్ద ఎత్తున భక్తులు పూజా కార్య క్రమాల్లో పాల్గొన్నారు. శుక్ర, శనివారాల్లో కూడా ఈ ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

చంద్రబాబు రాకతో రహదారికి మరమ్మతులు



గోతులు పూడుస్తున్న దృశ్యం

రాజాం: మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఈనెల 15న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద రోడ్డుషో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ విధంగా అయినా ప్రధాన రహదారికి మోక్షం కలుగుతుందని.. తమ ఇబ్బందులు తీరుతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

మీ అభిమానమే నా విజయానికి సోపానం

● సాలూరు కూటమి అభ్యర్థి సంధ్యారాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి

పాచిపెంట: 'ఎక్కడికి వెళ్లినా నన్ను ఆడపిల్లగా ఆదరించి అభిమానం చూపిస్తున్నారని, ఇదే నా విజయానికి సోపానమ'ని సాలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు అధ్యక్షతన పార్టీ మండల సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. టీడీపీ నేత ఆర్పీ భంజ్దేవ్, మెంటాడ నాయకుడు వెంకటరమణ, స్థానిక నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, ముఖి సూర్యనారాయణ, గూడేపు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు. ● రొడ్డవలసకు చెందిన పి.సన్యాసి, అమ్మవలసకు చెందిన రెయి అప్పారావుల సమక్షంలో సుమారు 50 మంది టీడీపీలో చేరారు. వారిని సంధ్యారాణి పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న జగదీశ్వరి, శత్రుచర్ల

గరుగుబిల్లి: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి అన్నారు. గురువారం సాయంత్రం బీపీపురం గ్రామంలో రాష్ట బీసీ విభాగం కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధి ఎం.తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, పి.వెంకటనాయుడు, ఎల్.గోపాలం, బి.జగదీష్, ఎం.రామారావు, కె.బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో విజయచంద్ర ప్రచారం



ప్రచారం చేస్తున్న బోనెల విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం పార్వతీపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. 20, 21 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోరాడ నారాయణరావు, నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవి చంద్రమౌళి, పాలకొండ రాజశేఖర్, హనుమంతు శంకర్, మీసాల వెంకటరమణ, జనసేన నాయకులు నందక అనిల్ తదితరులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. సూరమ్మపేటలో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, గ్రామంలో ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, కొల్లి తిరుపతిరావు, క్లస్టర్ ఇన్చార్జి బొమ్మినాయిని లక్ష్మణరావు, మర్రాపు యోగీశ్వరరావు, పకీరునాయుడు, సత్యనారాయణ, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు బోని దేవి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ అమరాపు రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘవలస పంచాయతీతో పాటు అడ్డూరువలస తదితర గ్రామాల నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఉమ్మడి అభ్యర్థి విజయచంద్ర కండువాలు వేసి స్వాగతం పలికారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి: జయకృష్ణ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జయకృష్ణ

సీతంపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఉమ్మడి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. గురువారం టీడీపీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు సవర తోట ముఖలింగం, బిడ్డిక విశ్వనాథం, ఆరిక అమల, నాయకులు గర్భాన సత్తిబాబు, గేదెల చిరంజీవి, సవర జమ్మయ్య, టి.తేజోవతి, ఆర్.రంగనాథం, హిమరిక పవన్, గంట సుధ, తోయక సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. ● అలాగే భామిని, వీరఘట్టంలో కూడా జయకృష్ణ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు.

'ఓటమి భయంతో వైసీపీ అవాస్తవాల ప్రచారం'

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలో ఓటమి భయంతోనే వైసీపీ అవాస్తవాలను ప్రచారం చేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు ఆరోపించారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ అభ్యర్థి తోయక జగదీశ్వరిని మార్చి వీరేష్దేవ్కు టిక్కెట్ ఇస్తారని ప్రచారాలు చేయడం తగదన్నారు. టీడీపీ నేత కె.కళావతి మాట్లాడుతూ నిజమైన గిరిజన బిడ్డ జగదీశ్వరి గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నన్ను కూటమి అభ్యర్థిగా ప్రకటించాలి

● పడాల భూదేవి

పాలకొండ: తనను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ప్రకటించాలని కూటమి నాయకురాలు పడాల భూదేవి కోరారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం పాలకొండ జనసేన టిక్కెట్ను నిమ్మక జయకృష్ణకు కేటాయించారని, దీనిపై పవన్ కల్యాణ్, చంద్రబాబు పునరాలోచించి తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంత్నాయుడు, సి.ఎల్.నాయుడు, అల్లు బుల్లి, గుమ్మడి సింహాద్రి, శాసపు సర్వారావు, మజ్జి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్



విజయనగరం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

పాలకొండ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. మొదటి స్థానంలో విజయనగరం నిలిచింది. రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో మన్యం-సి, నాలుగో స్థానంలో మన్యం-ఏ నిలిచాయి. వాలీబాల్ క్రీడాకారులు వండాన కురిమినాయుడు, గేదెల ధనుంజయ, నడుపూరు అప్పలనాయడు, పైల సర్వేశ్వరరావుల జ్ఞాపకార్థం నిర్వహించిన టోర్నమెంట్లో నిర్వాహకులు మొదటి బహుమతి సాధించిన విజయనగరానికి రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.13 వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన మన్యం-సి, ఎ జట్లకు రూ.10 వేలు, రూ.8,000 వేలు అందించారు. బెస్ట్ బూస్టర్కు రూ.1500, బెస్ట్ స్పైకర్కు రూ.1500, బెస్ట్ డిఫెన్స్కు రూ.1500 అందించారు. పోటీలను పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తదితరులు వీక్షించారు.

'రెల్లి సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలి'

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రెల్లి సామాజిక వర్గానికి చట్టసభల్లో అవకాశం కల్పించాలని ఆ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పాలకొండ రాజశేఖర్ కోరారు. పార్వతీపురంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్రతో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెల్లి కార్పొరేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్గా అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ కన్వీనర్ సొండి సంజీవి, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి సొండి గౌరీశంకరరావు, పాలకొండ మరియదాసు, సొండి చిన అప్పలస్వామి, పాలకొండ అనిల్, సొండి కృష్ణ, పాలకొండ వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా జైగురుదత్త హోమాలు



హోమం చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీఅనఘాదేవి సహిత జైగురుదత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

సాలూరు: అధికార వైసీపీకి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింహాచలం తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మువ్వల పుష్పారావును గెలిపించాలని కోరారు. పుష్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

మక్కువ: కాశీపట్నం కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 20 వరకు గడువు పొడిగించినట్టు పాఠశాల ప్రత్యేక అధికారిణి నాగదుర్గ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'కార్మికులకు ద్రోహం చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి'

పార్వతీపురంటౌన్: కార్మికులకు ద్రోహం చేసే పార్టీలకు బుద్ధి చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో మన్యం జిల్లా సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, ప్రధాన కార్యదర్శి మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ



తాగునీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వివిధ వార్డుల్లో తాగునీటి సరఫరాతో పాటు క్లోరినేషన్ తీరుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని 30 వార్డుల్లో ఈ వేసవిలో సంపూర్ణంగా తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

గిరిజన గ్రామాల్లో ఎల్ఈడీ వెలుగులు



ఎల్ఈడీ వీధి దీపాల కింద సమావేశమైన మహిళా మండలి సభ్యులు

కొమరాడ: జిల్లాలోని వివిధ గిరిజన గ్రామాల్లో ఎల్ఈడీ వీధి లైట్లు జన కల్యాణి సమాఖ్య (జేకేఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు సంస్థ కార్యదర్శి నిఖిల్ వర్గీస్ చెప్పారు. అంకుళ్లవలస, కోనవలస, మసిమండ, పూడేసు, సరుగుడుగూడ, బూర్జివలస, బంజుకుప్ప గ్రామాలు, శివన్నదొరవలస, కొత్త ఊరు, వెలగవలస, జిల్లేడువలస, జోకీల, తదితర గ్రామాల్లో 700 ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు వర్గీస్ తెలిపారు.

వైభవంగా ఉగాది సంబరాలు



మనోకు మెమోంటో అందిస్తున్న భాస్కరరావు, మహేష్పట్నాయక్ తదితరులు

రాయగడ: స్థానిక తేజస్వీ మైదానంలో బిజద రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు అధ్యక్షతన బుధవారం రాత్రి ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. తొలిరోజు మంగళవారం మజ్జిగౌరి మందిరం నుంచి కళశ యాత్ర జరిగింది. ఈ యాత్రలో బుల్లితెర యాంకర్ రష్మిక గౌతమి పాల్గొన్నారు. బుధవారం ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో బృందంచే సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. మనోతో పాటు గాయకులు శ్రావణ భార్గవి, హారిక నారాయణ్, అరుణ్ కౌండన్య తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యతగా ప్రముఖ యాంకర్ మృదుల వ్యవహరించారు. పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

కొల్లిగుడ మైదానంలో..

ఒడిశా

రాయగడ: బిజద సీనియర్ నాయకుడు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన కొల్లిగుడ మైదానంలో బుధవారం రాత్రి ఉగాది వేడుకలు నిర్వహించారు. తొలుత మజ్జిగౌరి ఆలయం నుంచి కళశ యాత్ర నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా టాలీవుడ్ నటి పాయల్ రాజ్పుత్, గాయకులు చాగంటి సాహితీ, రేణుకుమార్, పర్ణిక మాన్య, యాజిన్ నిహార్, బుల్లితెర నటులు రాకెట్ రాఘవ, నాగి, రాజ్మౌళి, భూమిక పాల్గొని, అలరించారు. ఈ వేడు కల్లో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సారక, స్థానిక శాసన సభ్యుడు మకరంద ముదిలి, పార్లమెంటు సభ్యుడు సప్తగిరి శంకర్ ఉలకా, బిజూ స్వస్థ్య కళ్యాణ యోజన సలహాదారు సుధీర్కుమార్ దాస్, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్డీసీ చైర్మన్ అనసూయ మాఝి పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.



కలశ యాత్రలో పాల్గొన్న కొండబాబు